# ఇల్లాలు

"మధుశ్రీ"

కోడి కుయ్యాకం తడవు ... ఎలా మెలకువ వస్తుందో ఇల్లాలికి !

ఆమె తీసుకొనే విశ్రాంతి రాత్రి పదిగంటలనుండి తెల్లవారుఝాము మూడున్నరవరకూ ... ! ఎంత వోపిక ... ఎంత వోరిమి ! చెప్పడానికి వీల్లేదు.

ఎంతెంత దేశనాయకులైనా ... ఎంతెంత కళాకారులైనా ఎంతెంత శాస్త్రవేత్తలైనా అమృత ప్రాయమైన నీ చేతి గోరుముద్దలు ఆరగించినవారే...!

ఎన్నో రత్నాల నందించేవు ! మాతృ ప్రేమని అన్నంలో ... మాటల్లో రంగరించి పెడతావు ... నీ కందులోనేవుందాహాయి ... నీకు బ్రహ్మ రాసి పడేశాడు. తెల్లారి లేచింది మొదలు మళ్ళీ పడుకునేవరకూ వంటింట్లో కొట్టుకుంటూవుండమని.. !

శీతాకాలం చలి ఎముకల్ని కొరుక్కుతింటూ వుంటుంది ... ప్రత్యూషవాయువుల్లో చలి మరీ యెక్కువ ... అయినప్పటికీ నువ్వు బద్ధకించవు ... అంత పెందలకడనే లేవడం ఎందుకు ? లేకపోతే ఎవరుచేస్తారు ... ?

చంటిపిల్లలు తెల్లవారుఝామునే లేస్తారు ... వాళ్లని పొత్తుల్లోకితీసుకొని ... బుజ్జగించి ... మళ్ళీ పడుకో పెడతావు ... జోలపాటపాడి నిద్రపుచ్చుతావు ... ఇంతట్లోకే చిట్టి తమ్ముడు లేస్తాడు ... శ్రీవారు కదలకుండా ముసుగుతన్నుకొని పడుకుంటారు ... లేచి తిన్నగా వంటింట్లోకే వెడతావు ... ఒక్కర్తివే ... చలి ... చీకటి ... అది మొదలుకొని పనులన్నీ దేవుకొనివస్తావు ... చంటిపిల్లలున్న కొంపలు ... వస్తువులేవీ స్థిరంగావుంచరు ... అన్నీ సమదాయించుకువస్తావు ... పొయ్యిలు బాగుచేసుకోవడం ... క్రితం రోజునుంచీవున్న గిన్నెలు శుభ్రపరుస్తావు ...

హోరున వాన ... ! చల్లగా గాలి ... ! ఇల్లాలు ! దానికీ లక్ష్యపెట్టవు ! "శీతల వాయువులు వొంటికిపడవు...రొంప దగ్గుపడతాయి ... ఇప్పుడు చెయ్యకపోతేరేం" అని ప్రశ్నిస్తే "ఆఁ ... ఇవ్వేళకొత్తా ఏమన్నానా ! ... ఎన్నాళ్లనుంచో అలవాటయిపోయింది ... " అంటావు ... మహాసాధ్వి ఇల్లాలు ... !

పొయ్యిలో నిప్పు రాజేస్తావు ... వెధవకట్టెలు ఎప్పటికీ మండవు ... కళ్లు చిల్లులుపడేలా పొగ ...! వానాకాలం అసలు మండవు ... అయినా నువ్వు విసుక్కోవు ... ! కాఫీ పెడతావు ... ఇంతట్లోకే కొంప మునిగిపోయినట్లు చంటి పాపాయి వుయ్యాల్లో వుండి సావేరిరాగం సప్తమ స్వరంలో అందుకుంటాడు ... !

"నిద్రపోకుండా ఏంచంపుతున్నావురా" అంటూ బద్ధకంగా వొళ్లు విరుచుకొని మరో వైపుకి తిరుగుతారు శ్రీవారు ... కుఱ్ఱాణ్ణి పలుకరించరు ...

పొయ్యిమీద పాలు అలాగే అట్టిపెట్టి పిల్లాణ్ణి సముదాయిస్తావు ... కడుపుతీపి ... ! నెమ్మదిగా తూర్పుదిశ ఎఱ్ఱపడుతుంది ... ఎఱ్ఱపడ్డమేమిటి ? బారెడు ప్రొద్దే ఎక్కుతుంది ! ఇంకా శ్రీవారు లేవరు ... కాఫీ అయింది లేవమంటావు ... అప్పుడే ఎనిమిది గంటలవుతుంది ... చంటి కుఱ్ఱాడికి ఆముదం పెడతావు ... నీళ్లు పోస్తావు ... కాటుకాబొట్టూ పెట్టి...పాలిచ్చి నిద్రబుచ్చుతావు ... . పాపాయి బుగ్గలమీద తనివితీరా ముద్దులు గుమ్మరిస్తావు ... ! మాతృత్వంలోని అనిర్వచనీయానందాన్ననుభవిస్తావు ... శ్రీవారికి నీళ్లు తోడియిస్తావు ... ఇవన్నీ నీ వొక్క రెక్కమీదే జరగాలి ... !

కుఱ్ఱాళ్లకి నీళ్లుపోసి ... తలదువ్వి ... బట్టలు కట్టి బళ్లోకి సాగనంపుతావు ... ఇవన్నీ చూసు

కుంటూవుంటే పెద్దబ్బాయి కాలేజీకి టైమవుతోందని కంగారుపెడతాడు ... ఇంజనులా పని చేస్తావు ... అన్నం వుడకబెట్టి పెద్దబ్బాయిని సాగనంపుతావు ... శ్రీవారికి ఆఫీసుకి టైమవుతుంది ... మడి కట్టుకూర్చుంటాడు ... అయినప్పటికీ విసుక్కోవు...! చూపుల్లో ప్రేమను మిళితంచేస్తావు...!

ఆ కూర కలుపుకోమని ఈ పచ్చడి తినమని ... చిరునవ్వుతో "ఎంకరేజి" చేస్తావు ... ! ఆయనగారు తీక్షణంగా చూస్తే వొణికిపోతావు ... ! శ్రీవారికి బట్టలుతీసిచ్చి ... జోళ్లుదులిపి ... తమలపాకులకి సున్నంరాసిచ్చి ... ఆఫీసుకు సాగనంపుతావు ... ! అప్పటికి ఊపిరి పీలుస్తావు ... !

భోజనానికి కూర్చోబోతే ... చంటి కుర్రాడు లేస్తాడు. వాణ్ణి చంకనెట్టుకొని భోజనం అయిందనిపిస్తావు ... ! ఒంటిగంటవుతుంది నువ్వివతలపడబోయేసరికి ... ! కుర్రాళ్లు స్కూళ్లనుంచి చక్కా వస్తారు...! వాళ్లకి అన్నంపెట్టి మళ్లీ మధ్యాహ్నం కాఫీకి నీళ్లెట్టుతావు ... ! రెండయిపోతుంది...

సాయంకాలం వంటకి సరంజంచేస్తావు ... ఆయనకి బాగా ఏది ఇష్టమో అవే చేసిపెడతావు ... ! నీకు స్వార్థంలేదు ... ! సాయంకాలం అవబోయేసరికి శ్రీవారు బండెడు ఫైళ్లతో ప్రత్యక్షమవుతారు ... ఎదురుగుండా వెళ్ళి ఆయన్నిచూసి జాలిపడతావు...! నిన్నుచూసి ఎవ్వరూ జాలిపడరు...! ఆమెకసలు విశ్రాంతిలేదు. నీకసలు సెలవుల్లేవు ... ఆదివారం ! ... పబ్లిక్ హాలీడేస్‌లోనూడా...వాన కురిసినసరే ... తుఫాను పట్టినాసరే...! ప్రపంచం తలక్రిందులయినాసరే ... ! నీకొక్క నిముషం గాలి పీల్చుకుందుకు విశ్రాంతిలేదు ... ! రాత్రి భోజనాలుపెట్టి ... పక్కలువేసి ... కుర్రాళ్లని నిద్రపుచ్చి భోజనానికి కూర్చుంటావు ... ! వంటిల్లు సర్దుకొని తాళాలు పెట్టుకునివతలపడేసరికి పది గంటలు ... !

శ్రీవారు మూడోకాలంలో వుంటారు...పాపం అలసిపోయేరనుకుంటావు ... ! రేపు చేసుకోవలసిన పనులు మననం చేసుకుంటావు ! నిద్రపోతావు ... నీ నిత్య జీవితంలోని కార్యక్రమం ఇదే...ఇల్లాలు... నీ కెప్పుడు కాళీవుండదు ...

"ఇల్లాలి చలువయె
ఇల్లులకు వెలుగు ..."


# ఏజంట్లు కావాలి!

రాజమహేంద్రవరం, హైదరాబాద్, సికిందరాబాద్, ఒంగోలు, కడప, తిరుపతి — యింకా యితర ప్రదేశాలలో మాపత్రికలు అమ్మబడని చోట్లలో తమ స్వంత బాధ్యతపై అమ్ముటకు - ఏజంట్లుగా నున్నవారికి రూ. 100/-కు రూ. 20/-లు. కమీషను, ఒక ఫ్రీకాపీ యివ్వబడును.

అడ్వర్టైజుమెంటులను కాన్వాస్ చేయువారికి మంచి కమీషను సదుపాయముల నివ్వగలము.

వివరములకు:

గృహలక్ష్మి కార్యాలయం
రాయపేట, మద్రాసు-14